# 6

## మంచికంటి



"అయ్యోతల్లీ ఇంకా నిద్ర లేవలేదా! ఇలాగైతే ఎలాగే! చూడు నీ తోటి వాళ్ళేగా.... ఎప్పుడు లేశారో.... ఎప్పుడు వెళ్ళి పోయి వరుసలో నిలబడ్డారో చూశావా! వాళ్ళ ఆసక్తి చూడవే.... వాళ్ళ పోటీతత్వం చూడవే... చూడు... చూడు.....ఎంత వేగంగా పైకి ఎగబాకుతున్నారో.... ఒకసారి చూసి నేర్చుకో....

అయినా వినవు చూడు. అందుకే నీలాంటి వాళ్ళను మొట్ట బుద్ధవుతుంది. అవతలి వాళ్ళను చూసి నేర్చుకోమ్మా అంటే వినవు. అక్కడ నెప్పంటావు.ఇక్కడ నెప్పంటావు.చలాకీ తనమే లేదూ....! ఎంతకాలం ఒకరు వెంటబడి తరుముతారు చెప్పు.

అదుగో చూడు... వాళ్ళను చూస్తుంటే కడుపు నిండుతుంది చూడు.హూ.... నాకూ ఉన్నారు కోసుకు తినడానికి! పుణ్యం కొద్దీ పురుషులు దానం కొద్దీ బిడ్డలంటారు.మనకు తెలియదనుకో .... అవతలి వాళ్ళు ఎలా చేస్తున్నారో చూడాలి కదా! ఛీ...ఛీ ఎందుకు పుట్టారే మీరు?

అందరూ ఎంచక్కా ఫస్టు సెకండుల్లోనే ఉంటారు. మిమ్మల్ని ఏమనాలో నాకే అర్థం కావడం లేదమ్మాయ్. నా ఖర్మ గాశారం ఇంతే అనుకుంటా భోరు భోరుమని ఏడవసాగిందామె.

" అమ్మా మీరు ఏడ్చి అనవసరంగా నన్ను ఏడిపించొద్దు. ఎందుకు అలాగ అరుస్తావు. నన్నేం చెయ్యమంటావు చెప్పు. ఇంతకంటే వేగంగా వెళ్ళలేక పోతున్నాను.ఒకే తల్లికి పుట్టిన బిడ్డలే ఒక రకంగా ఉండరే! అలాంటిది అందరూ ఒకేరకంగా ఎలా చదువుతారమ్మా. ఎవరి శక్తి కొద్దీ వాళ్ళు చదువుతారు గానీ..."

ఇదిగో మెట్ట వేదాంతం చెప్పడం నేర్చుకున్నావు. ఇంక నువ్వేం బాగుపడతావు. అదేం కుదరదు. నీ ఆలోచనా విధానం మార్చుకో. ఎవరైనా సరే ఏవిధంగానైనా సరే మొదటే ఉండడానికి ప్రయత్నించాలి.పట్టుదల ఉంటే ఏమైనా సాధించొచ్చు.దూర దూరంగా తిరగడానికా వేలకు వేలు పోసేది.యెనకా ముందూ ఆడదానికా లక్షలకు లక్షలు ఖర్చుచేసేది.

# మొగ్గలు రాలిపోతున్నాయి



లే... ముందు..... లేచి కదలాలి. ఏం లాభం లేదమ్మాయ్. అదుగో కనిపిస్తున్నాయి చూడు. ఆ మెట్లు దాకా ఎక్కాలి. వాళ్ళందరూ చూడు వడివడిగా వెనక్కి తిరిగి చూడకుండా ఎలాగ ఎక్కుతున్నారో.... నువ్వు కూడా అదే వేగంతో ఎక్కాలి. అర్ధమైందా..... ఆ....! చూడు చకచకా ఆ అమ్మాయి అప్పుడే ఎన్ని మెట్లు ఎక్కిందో. వాళ్ళందరూ చూడు వడివడిగా వెనక్కి తిరిగి చూడకుండా ఎలాగ ఎక్కుతున్నారో.... నువ్వుకూడా అదే వేగంతో ఎక్కాలి. అర్ధమైందా.... ఆ..... చూడు.... అమ్మో.... వాళ్ళు చూడు."

"అమ్మమ్మో.... ఎంత ఎత్తున ఉన్నాయి. అవన్నీ మెట్లేనా....! ఒకటీ.... రెండూ పదీ..... పదిహేనూ... అయ్యో..... లెక్కకే అందడము లేదే.....

"అమ్మా..... అమ్మా.... గుండెల్లో నొప్పిగా ఉందమ్మా. అన్ని మెట్లు ఎక్కలేనమ్మా". "అయ్యో తల్లీ నిలువునా కూలబడి పోతున్నావేందమ్మా. లే లే.... ఎట్టమ్మా అట్టంటే. ఎక్కాలమ్మా. ఎన్ని మెట్లయినా కళ్ళు మూసుకొని ఎక్కాలి. పంటి బిగువునైనా పాకాలి" గుడ్లు మిటకరించి చూసిందా అమ్మ.

నువ్వు చెప్పినట్టే వింటానమ్మా. అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు సుడులు తిరగడానికి సిద్ధంగా ఉన్నాయి. అమ్మా.... అమ్మా అలా చూడకమ్మా. భయ్యం పుడుతుందమ్మా".

"ఆ....ఆ..... అదే అదే. తుడుచుకో కళ్ళు. ఎందుకా ఏడుపు? ఊ.... కానియ్ మొదలుపెట్టు. ఎన్నిసార్లు చెప్పాలి. రెడీ ఒన్....టూ....త్రీ...."

ఈ మెట్లెక్కితే ఎంతో హాయిగా ఉంటుంది. ఎక్కుదువు పద.... నీకు తెలియదమ్మాయ్.... పద.....పద......పద...... ఎక్కు..... ఎక్కు.... ఎక్కూ...."

"చెప్పడానికి మీకేమి. చాలా తేలిగ్గానే చెబుతారు. ఎక్కేవాళ్ళకు కదా తెలిసేది. రాత్రింబవళ్ళూ ఈ మెట్లు గురించే ఆలోచిస్తుంటే తల బద్ధలౌతుందమ్మా. కాస్త అటూ ఇటూ తల తిప్పినా జారిపోతామని ఒకటే భయం. ఇంక నావల్ల కాదమ్మా. ఇక్కణ్ణుంచి ఎక్కలేకపోతున్నానమ్మా. నా వల్ల కాదంటే కాదమ్మా" ఆ అమ్మాయి వరద నీరే అయ్యింది.

అయినా వదల్లేదమ్మా. చాలా పట్టుదలతో ఉంది. ఎంతో దృఢ నిశ్చయంతో ఉంది. కాస్త అలా పట్టు వొదిలి కళ్ళు మూసుకుంటే....! అమ్మో.... ఇంకేమైనా ఉందా ! అందర్లో తల కొట్టేసినట్టుగా ఉండదూ ! అమ్మమ్మో.... ఆ ఊహే భరించలేను.

ఊహూ.... ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కు తగ్గడానికే లేదు. బలవంతంగానైనా ఎక్కాల్సిందే ! హూంకరించిందామె.

"ఎందుకమ్మా నా ఉసురు బోసుకుంటారు. నాకు ఇష్టమే లేకుండా నన్నింత దూరం తోసుకు వస్తున్నారు. మా మనసుల్లో ఏముందో ఆలోచన లేకుండా ముందుకు నెడుతున్నారు. చదువుకోవడములో కూడా ఇంత హింస అవసరమా అమ్మా. రేపు జీవితంలోకి ఆనందంగా ఎలా అడుగుపెడతామమ్మా. మా గురించి ఆలోచించరేంది మీరు? మమ్మల్ని అసలు అర్థం చేసుకోరేంది !"

"నలుగురితో నారాయణ. అందరూ ఎటు పోతున్నారో ! మనమూ అటే పోవాలి. పోటీలో వెనుక పడితే రేపు నిన్ను ఎవరు చేసుకుంటారమ్మా. ఇవాళ కష్టపడ్డావనుకో. రేపు హాయిగా అమెరికాకు ఎగిరిపోవచ్చు. అక్కడికి పోతే ఇంకేముందమ్మా స్వర్గంలో అడుగుబెట్టినట్టే కదా ! నీకు అడ్డం ఏముంటుందమ్మా. అక్కడసలు నీకు తీరని కోరికలుంటాయా చెప్పు.

నిద్రలేస్తే కార్లోనో.... ఫ్లైట్లోనో కదా. ఎక్కడికైనా పోయేది. నేలమీద కాలు పెట్టేదేలేదు కదమ్మా. ఆ స్వర్గంలో మునిగి తేలడానికే కదా ఈ వెతలన్నీ. రేపటి సుఖం కోసం ఇవాళ కష్టపడాలి. ఎన్ని సుఖ సంతోషాలనైనా వొదులు కోవడానికి సిద్ధంగా ఉండాలి. తప్పదమ్మా తప్పదు.

ఎక్కగలిగినా... ఎక్కలేకపోయినా... పళ్ళు బిగబట్టి ఎక్కాల్సిందే.... ఎక్కు ఎక్కు... త్వరగా.... త్వరత్వరగా.... ఊ.... మేము ఎక్కేది కాకపోయే.... లేకపోతే... మేమన్నా....!

"అమ్మా ఇక్కణ్నుంచి మరీ కష్టంగా ఉందమ్మా. అమ్మా.... అమ్మా.... ప్లీజ్.... నన్ను నేలమీద నడవనియ్యండమ్మా. ఆకాశానికి నిచ్చెనలు వెయ్యొద్దమ్మా."

"కష్టమేనమ్మా...." అయితే అంతటితో ఆగిపోతామా ! ఇక్కడ నుండయితే మేము కూడా నీకు తోడుగా ఉండను కూడా ఉండము. ఒంటరిగానే ముందుకు సాగాలి నువ్వు. ధైర్యం తెచ్చుకో. పక్క వాళ్లను చూస్తూ ఉండు. గుండెల్నిండా గాలి పీల్చుకో. బాధగా ఉంటే ఒకటీ.... రెండూ.... మూడు- పది ఒంట్లు లెక్కబెట్టుకో. ఆంజనేయస్వామి దండకం చదువుకో. వెంకటేశ్వర సుప్రభాతం పాడుకో. షిర్డీ సాయిబాబాను తలుచుకో. కో....కో"

ఎలాగైనా సరే ముందు వరుసలోనే ఉండాలి. పో....పో.... ముందుకే పో.... మా కంటికి కనిపించకుండా పో."

"మీ తపన మీదేనమ్మా. మేం మనుషులమన్న విషయం గానీ పిల్లలం అన్న విషయం గానీ గుర్తే ఉండడము లేదమ్మా. మీరు గుర్తించడమే లేదమ్మా. కళ్ళల్లో నుండి కారిపోతున్న కన్నీళ్ళను తుడుచు కుంటూనే అమ్మా ఇక్కడ కాలే లేవడము లేదమ్మా. ఎంత కదిలించాలన్నా కాలు కదలడం లేదమ్మా."

"పడిపోతావు జాగర్త తల్లీ. అయ్యయ్యో... జాగర్తమ్మా... అరే.... జారిపోతున్నావమ్మా జార కూడదమ్మా. ఒకవేళ జారినా ఎట్టి పరిస్థితుల్లో మళ్ళీ ఎగబాకాల్సిందే ! ఇంక వేరే దారే లేదు.... నీ ఇష్టం.... ఆ ! ఏమనుకుంటున్నావో!

కమాన్.... హరియప్..... ఇంక మాకు టైమైందమ్మా. మేం వెళ్ళాలి తల్లీ. జాగర్తమ్మా. వెళ్ళొస్తా

మమ్మా. బా....బాయ్.....తల్లీ. జాగ్రత్త."

"ఇంక నా పని అయిపోయిందిలే. ఇంక నా వల్ల కానేకాదు. అమ్మా... అమ్మా కళ్ళు మూతలు పడిపోతున్నాయమ్మా. శక్తంతా హరించుకుపోతుంది. చేతులు పట్టు తప్పుతున్నాయమ్మా. తల్లకిందులై పోతున్నానమ్మా.

బతుకింత కష్టంగా ఉంటుందా ! అమ్మో ఈ వయసులోనే ఇంత రోతగా ఉంటే ముందు ముందు ఇంకెంత హీనంగా ఉంటుందో ! ఇంత కష్టంతో చెట్టు ఎక్కినంత భయంగా ఈ మెట్లు ఎక్కుతూ ఉండాలి.

ఇంక నా వల్ల కాదంటే కాదు. అలిసి పోయాను. జారిపోతుంది. పట్టు తప్పి పోతుంది. బతుకు నావ వొరిగిపోతుంది. ఒడ్డే కనిపించడము లేదు. అంతా నీరే.... చుట్టూ నీరే... సముద్రంలో దారే కనబడడము లేదు. చుట్టూ ముసురేదో కమ్ముకుంటుంది. రాదారే కనుమరుగైపోతోంది. నావ మునిగిపోతుంది. దగ్గరకు రాకండి. ఎవ్వరూ నా దరి చేరకండి. మునిగి.... మునిగిపోతున్నాను. నీళ్ళు.... ఎటు చూసినా నీళ్ళే.... కన్నీళ్ళే.... కన్నీళ్ళలో మునిగి తేలుతున్నాను. మునకలేస్తున్నాను.

కళ్ళనిండా నీళ్ళే.... కళ్ళు చుట్టూ నీళ్ళే.... కనుచూపుమేర నీళ్ళే... కన్నీళ్ళే అయిపోతుంది. తెరచాప చినిగిపోయింది. నావ మునిగిపోయింది.

ఆ.... అమ్మా.... నన్ను.... నన్ను క్షమించమ్మా.

పోయిన వారమే కదంటమ్మా... మేము వొచ్చి ధైర్యం చెప్పి వెళ్ళింది. ఇంత పిరికిదానివి అనుకోలేదమ్మా. ఇంతలోకే ఇదైపోతావనుకున్నామా! నీ చుట్టూ ఎన్ని కలలు.... ఎన్నెన్ని వలలు.... ఇన్నిన్ని వలపులు.... ఎన్నెన్ని మలుపులు.... పోగుజేసుకున్నా మమ్మా. అప్పుడే చల్లారిపోయింది. బతుకు తెల్లారి పోయిందా! మా అందర్నీ అన్యాయం జేసి ఇంత అర్ధంతరంగా వెళ్ళిపోతావని అనుకోలేదమ్మా. ఇంతలోనే ముంచుకొస్తుందనుకోలేదమ్మా. అయ్యో ఈ కష్టాన్ని ఎవరికి చెప్పుకోవాలా భగవంతుడా !" కంటికి మింటికి ఏకధారగా ఏడుస్తుందామె.

"అమ్మా.... అమ్మా.... ఇదుగో అమ్మాయి గదిలో ఈ లెటర్ దొరికింది." ఎవరో తెచ్చి ఇచ్చా రామెకు.

"ఉత్తరం రాసి పెట్టిపోయే ఖర్మేం వొచ్చిందే తల్లీ నీకు. ఏం రాశావమ్మా ఇందులో. కళ్ళు కూడా అలుక్కుపోతున్నాయమ్మా. కళ్ళల్లో నీళ్ళు నిండుతున్నా యమ్మా ఈ గోరాన్ని చూస్తుంటే !"

ఊరుకో ఇప్పుడు నువ్వు ఏడ్చి, ఆ ఉత్తరాన్ని తడిపెయ్యొద్దు. నా చిట్టితల్లి జ్ఞాపకాల్ని తుడిచెయ్యొద్దు. అమ్మాయి అరుపుల్ని చెరిపెయ్యొద్దు" అరుస్తున్నా డాయన.

"ఇంతకీ ఉత్తరంలో ఏం రాశావమ్మా !"

కళ్ళు నులుముకుని, తేమ తుడుచుకుని మడతలు విప్పింది.

ప్రియమైన అమ్మానాన్నల పాదపద్మాలకు నమస్కరించి వ్రాయునది, ఏం రాయలో అర్థం కావడము లేదమ్మా ! ఇదే కదా చివరిసారి మీతో మాట్లాడటము. అందుకే నా బాధనే చెబుతున్నానమ్మా.

హాయిగా.... ప్రశాంతంగా ఆడుతూ.... పాడుతూ.... సంతోషంగా గడపాల్సింది కదా బాల్య మంటే... ఊహ తెలిసినప్పటి నుండీ.... ఇల్లూ... స్కూలూ.... ట్యూషనూ.... ఇవి తప్ప మరే ప్రపంచ మన్నా తెలుసంటమ్మా. ఎప్పుడైనా సంతోషంగా గడపడానికి బయటికి తీసుకెళ్ళారా అమ్మా మమ్మల్ని. ఒకవేళ మీరు వెళ్ళాల్సి వొస్తే పక్కింట్లోనో.... ఎదురింట్లోనో... అప్పజెప్పి స్కూల్‌కి వెళ్ళమ్మా అని చెప్పి తమ్ముణ్ణి తీసుకుని వెళ్ళేవారు కదా !

నాకు ఒక ఆట తెలుసా! ఒక పాట తెలుసా! అమ్మా... చదువు..చదువు... చదవడం తప్ప నాకే విషయం తెలుసమ్మా ! ఇలాంటి బతుకంటే ఎవరికైనా విసుగు పుట్టకుండా ఎలా ఉంటుందమ్మా. అందునా మామూలు చదువు కూడా కాదైపోయే. ర్యాంకులు ర్యాంకులుగా ముందుకు దూసుకుపోవాల్సి ఉండే...!

విలాసవంతంగా గడపాల్సిన జీవితాన్ని ఇంత బలవంతంగా అంతం చేసుకుంటున్నానని మీకు దిగులుగా ఉంది కదూ !

మీ గతాన్ని ఒక్కసారి నెమరేసుకొని చూడండి. పిల్లల్నుండి పెద్దవాళ్ళుగా ఎలా పెరిగారో గుర్తు చేసుకోండి. మీ బాల్యంలోకి తొంగి చూసుకోండి. ఎన్నెన్ని ఆటపాటల్తో ముద్దు మురిపాలు మూటకట్టుకున్నారో నువ్వూ నాన్నా ! అప్పుడప్పుడూ చెప్పేవాళ్ళు గుర్తుందా ! ఎన్నెన్ని స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ ఆనంద తరంగాల్లో తేలియాడారో మీరు చెబుతుంటేనే ఎంత సంతోషమేసేది.

మరి మమ్మల్నెందుకమ్మా ఈ నరక కూపాల్లోకి తోసివేస్తున్నారు. అందరూ కలిసి మెలిసి ఉంటూ చదువుకుంటుంటే ఎంత బాగుంటుందమ్మా. మందలు మందలుగా చుట్టూ పిల్లలున్నా కానీ ఎంత భయం భయంగా ఉంటుందో తెలుసామ్మా ఇక్కడ. మాది నిజంగా చదువేనంటమ్మా ! నరకమంటారే.... అది ఎక్కడో లేదమ్మా.

ఎందుకమ్మా చదువుల పేరుతో ఇంతగా హింసిస్తున్నారు. చదువు చదువు అంటూ మమ్మల్ని ఇళ్ళనుండి బయటకు నెట్టేస్తున్నారు. వేలూ లక్షలూ పోసేస్తున్నారు. దాంతో మీ బాధ్యత తీరిపోయిందని చేతులు దులుపుకుంటున్నారు.

ఆత్మీయంగా – అనురాగంతో చూడాల్సిన గురువులేమో మాకు తంత్రాలు చెబుతున్నారు. యంత్రాలుగా మారుస్తున్నారు. పుస్తకాల్లో ఉన్నది




డా॥ ఎన్.గోపి రచించిన 'నానీలు'కు మరాఠీ అనువాదం గ్రంథం 'నానీలు – ముక్తక్ మణికా'ను మరాఠీ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శ్రీ డి.పి.జోషి హైదరాబాద్‌లో ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో ఆం.ప్ర.హిందీ అకాడమీ పూర్వ అధ్యక్షుడు డా॥పి. విజయరాఘవరెడ్డి, అనువాదకుడు శ్రీ సురేష్ గంగా ఖేడ్‌కర్, మూలకవి గోపి, సభాధ్యక్షురాలు, ఉస్మానియా డీన్ – ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ మీనామాన్వీ, ఉస్మానియా మరాఠీ శాఖ బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ శోభాదేశ్‌ముఖ్, శాఖాధిపతి గీతా సురేష్‌కాటే ఉన్నారు.

మినహా ఏ ప్రపంచమూ తెలియని వాళ్ళు పుస్తకాల్లో ఉన్నదంతా మా మెదళ్ళలో కుక్కెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నారే తప్ప..మాకు ఏ విధంగా చెబితే ఆనందంగా నేర్చుకుంటామో వాళ్ళు ఆలోచించడమే లేదు.

మాకేంకావాలో ఎవరికీ పట్టడము లేదమ్మా. హాయిగా ఆనందంగా ఆడుతూపాడుతూ గడపాలనుకోవడం. ఆటపాటల మధ్య చదువుకోవడం కాకుండా క్షణక్షణం భయపడుతూ మెట్లు ఎక్కాలనుకోవడం ఎంత అవివేకంగా ఉందమ్మా. అందుకే ఈ హింసాత్మక చదువుల మధ్య నా మనసు తట్టుకోలేక పోయిందమ్మా.

చదవనంటే మీరు తట్టుకోలేకుండా ఉన్నారు. చదవాలంటే నేను తట్టుకోలేకుండా ఉన్నాను. ఎటు చూసినా శూన్యమే కనిపిస్తుందమ్మా.

ఇంక నా వల్ల కాదు. అందుకేనమ్మా. మీకు బాధైనా తప్పలేదమ్మా. ఇంతటితో ఈ తనువు చాలిస్తున్నాను. మీ హింసల బారినుండి సంతోషంగా ఆనంద లోకాలకు వెళ్ళిపోతున్నాను. తమ్ముడినన్నా జాగ్రత్తగా చూడండమ్మా. బై....బై.....

"ఎంతపని చేశావు తల్లీ. అస్సలు నమ్మలేక పోతున్నానమ్మా" ఏడుస్తూ కూర్చుందామె.

ఇంటి ముంగిట్లో శవాన్ని ఉంచారు. ఎక్కడెక్కడి వాళ్ళో వొచ్చి చుట్టూ కమ్ముకుంటున్నారు.

"మీ అమ్మాయేనా తల్లీ మొన్న మా అబ్బాయి కూడా ఇంతేనమ్మా" పక్కబజారు కమలమ్మ చెప్పింది.

"మా పక్కింటి పిల్లకూడా ఇట్టనే చేసుకుందమ్మా. అక్కడెక్కడో అందర్నీ కుప్పేసి చదివిస్తుంటారంటమ్మా. ఆడనించి పీనిగలు లేస్తానే ఉంటయ్యంటమ్మా" రత్తమ్మ చెబుతుంది.

ఏడుపులూ పెడబొబ్బలతో ఆవరణంతా మార్మోగిపోతుంది. వాళ్ళను చూస్తుంటే ఎవరికైనా హృదయం ఇట్టే ద్రవించిపోతుంది.

"చెట్టంత బిడ్డను ఎవరు పొట్టన పెట్టుకున్నారమ్మా. అందరి మెదళ్ళలో ఉదయించిన ప్రశ్న. చుట్టూ చేరిన వాళ్ళు పొడిచి పొడిచి అడుగుతున్నారు. తండ్రిని పదే పదే పొడుస్తున్నారు. తల్లిని గుచ్చిగుచ్చి చూస్తున్నారు.

"ఏమని ! చెప్పమంటారమ్మా ? ఎవరని చెప్పమంటారయ్యా.....? ఎంత బాగా చదివేదో ! ఎన్నెన్ని ర్యాంకులు తెచ్చుకునేది ! ఇప్పటినుండే అమెరికా అల్లుడికోసం వలలు వేసే ఉన్నాం కదమ్మా.

ఇంతలోకే ఇంత ఉపద్రవం ముంచుకొస్తుందని అనుకోలేదు కదమ్మా. అప్పుడే నీకు నూరేళ్ళు నిండిపోయినియ్యంటమ్మా. మీ కోసమే కదా పైసా పైసా కూడబెడతుంది. ఇంతలోనే ఇంత అన్యాయం చేసి పోతావనుకోలేదమ్మా.

రాండయ్యా రాండి. వొచ్చి చూడండి నా చిట్టితల్లిని. చివరిసారిగా బాగా చూడండి. ఎట్లా నిద్రపోతుందో చూడండయ్యా. కళ్ళు తెరుచుకొని పుస్తకం చదువుతున్నట్టే ఉందమ్మా. గోరింటాకు చేతుల్తో పరీక్షలు రాస్తున్నట్టే ఉందమ్మా"

వాడు వొక్కణ్ణీ తోడు లేకుండా ఒంటరివాణ్ణి చేసి వెళ్ళిపోయావా తల్లీ" ఆయన ఏడుపు కట్టలు తెంచుకుంది.

శవం ముందు కూర్చుని ఏడుస్తున్న ఆమె హఠాత్తుగా ఏడుపు ఆపేసింది. పవిట చెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంది. ఎదురుగా అందర్లాగే కూర్చుని కొడుకు కనిపించాడు.

వీడేంది అమాయకంగా ఇక్కడ కూర్చొని ఉన్నాడు. ఆమెకు ఏమీ అర్థం కాలేదు. అస్సలు మర్చిపోయాడా ఏంది? ఓరి వీడి అసాధ్యంకూలా.... గుండెలు బాదుకుంటూ కొడుకు దగ్గరకు వొచ్చింది. వాడి వంక ఎగాదిగా చూసింది.

ఆమె తనవైపు ఎందుకు చూస్తుందో అర్థంగాక అయోమయంగా ఆమె వంక చూశాడు.

"ఏరా బుద్ధుండా నీకు?" గద్దించిందామె.

తాను ఏమి తప్పు చేశాడో....! తల్లి తనను ఎందుకు తిడుతుందో తెలియక, అమాయకంగా, ప్రశ్నార్థకంగా ఆమెవైపు చూశాడు.

"ఇక్కడ కూర్చున్నావేమిటి? బిగ్గరగా ప్రశ్నించింది.

ఈ పరిస్థితిలో ఇంక ఎక్కడ కూర్చోవాలో అర్థం కాలేదతనికి. ఎందుకలా తల్లితనను అడిగిందో తెలియలేదు.

"క్లాసులుఎగ్గొట్టి ఇంట్లో కూర్చున్నావేమిటి?" చదువంటే ఏమనుకున్నావ్? గుడ్లురుముతూ అడిగింది.

"అది కాదమ్మా అక్క చనిపోయింది కదా ! నాకు బలే ఏడుపు వొస్తుందమ్మా. ఇంక నన్నెవరు తమ్ముడూ అని పిలుస్తారమ్మా ! నన్ను మనసారా ఏడవనియ్యమ్మా. అమ్మా.... అమ్మా రేపు వెళ్తానమ్మా. ఈ ఒక్కరోజుకు వొదిలెయ్యండమ్మా" బతిమాలుతూనే ఉన్నాడతను.

"అయ్యా మేము అందరం ఉన్నాము యాడవడానికి. నువ్వేం అవసరం లేదు. క్లాసులు ఎగ్గొట్టడానికి ఇదొకసాకు చూయించాల్సిన అవసరమేం లేదు.

నువ్వుఏడిస్తే పోయిన అక్కారాదు. దానికి ధారబోసిన డబ్బూ రాదు. అది అమెరికాకూ పోదూ! నువ్వు కూడా ఇక్కడే కూర్చుంటే ఇంకేమైనా ఉందా ! అమ్మో కొంప కొల్లేరైపోదూ ! అవ్వ....వ్వ....వ్వా" నోటిమీద కొట్టుకుంటూ చెప్పింది.

.ఒక్కరోజమ్మా ఈ ఒక్కరోజు. ఇంటిదగ్గర అక్క శవమైపడి ఉంటే నేను కాలేజీకి పోయి ఎలా చదవగలనమ్మా. వాళ్ళందరి మధ్యా ఎలా కూర్చోగలనమ్మా ఒక్కసారి ఆలోచించమ్మా !"

"ఒక్కరోజు.... ఒక్కరోజంటున్నావు. ఈ ఒక్కరోజు పోతే తిరిగి వొస్తుందా! ఇరవైనాలుగ్గంటలు. ఎన్నో నిమిషాలు.... ఎంత సిలబస్ మిస్సవుతావు? ఒక్క మార్కు తగ్గితే ఎన్ని ర్యాంకులు వెనక్కు పోతావో తెలుసుగా !

ఆ కన్నీళ్ళేదో మేము పెట్టుకుంటాం. ఆ ఏడుపులేవో మేమే ఏడుస్తాం. అదంటే ఆడపిల్లసరే! ఎలాగో పోయింది. పోయినా పెద్ద లెక్కలేదనుకో. మగపిల్లాడివి వెనకబడితే ఇంకేమైనా ఉందా! మార్కెట్లో ఎవరైనా లెక్క చేస్తారా !

"పో... పోయి బట్టలేసుకో.... పెట్టె తీసుకో.... పుస్తకాల కట్టల్ని మోసుకుని పో.... పోరా..... పో..... పారిపో.... పో....పో....పో...

అయిష్టంగానే.... బలవంతంగానే బయలుదేరాడతను. కష్టంగానే అడుగులేశాడతను. పోతూ... పోతూనే.... "అమ్మా.... అమ్మా... ఈ ఒక్కరోజమ్మా" బతిమాలుతూనే ఉన్నాడు. బామాలుతూనే ఉన్నాడు.

"ఆమెకి కొడుకు చదువుమీద ఎంత శ్రద్ధో చూడండి" పెదవి విరిచిందొకామె. ఆ మాట చెవినబడగానే ఆమె ఛాతీ రెండంగుళాలు పొంగింది. ఇంకా హుషారొచ్చింది.

"వెనక్కి తిరిగి చూడకుండా పో.... మాకు అందకుండా పో....దూరదూరంగా వెళ్ళిపో. కాలంతో పాటు కదిలిపో. ఒంటరి తీరాలకు సాగిపో! మమ్మల్ని ఏకాకుల్ని జేసి దూరదూరంగా ఎగిరిపో. గదిమింది. అరిచింది. ఉరిమింది. కసిరింది.

"ఎందుకమ్మా ఇంత క్రూరంగా ప్రవర్తిస్తున్నావు. ఇంత రాక్షసంగా తరుముకుంటున్నావు. ఇంత ఘోరంగా దులిపేసుకుంటున్నారు. మేం పిల్లలమన్న విషయమే మర్చిపోతున్నారు కదమ్మా. మాకూ మనసుంటుందనీ... ఆలోచనలుంటాయనీ... ఆవేశకావేశాలుంటాయనీ... కోరికలుంటాయనీ...దుఃఖానందాలుంటాయనీ ఎందుకు మర్చిపోతున్నారమ్మా.

ఒకరిని చూసి ఒకరు ఒకరిని చంపి ఒకరు ఏట్లోకి తోసేస్తూనే ఉన్నారు. నీట్లోకి నెట్టేస్తూనే ఉన్నారు.

యంత్రాల్లాగా చదివినంత కాలం చదివి మంత్రించినట్టు ఉద్యోగాల్లో చేరిపోతాం. అక్కడ యంత్రాల్లో యంత్రాలుగానే కలిసిపోతాం. ఇంక మాకు జీవితమేం మిగిలిందమ్మా. యంత్రాల్లాగే మా జీవితాలూ తెల్లారిపోతాయి అనుకుంటూ ఆ అబ్బాయి వెళుతున్నాడు. అడుగులో అడుగేసుకుంటూ వెళుతున్నాడు. ఆలోచనలు కుదిపేసుకుంటూ వెళుతున్నాడు.

భయం భయంగా వెనక్కె నక్కి తిరిగి చూస్తూ వెళుతున్నాడు. ఆమె వంక నిరాశగా చూస్తూ వెళుతున్నాడు. ఆమెకు అందనంత ఎత్తుకు వెళుతున్నాడు. వాళ్ళు అందుకోలేనంత దూరం వడివడిగా వెళుతున్నాడు.